టి.రామాంజనేయులు



చదువు విలువ

"మీకు అలా చెప్పిందెవరండీ. వాడి నోరు మూతపడ. నా కొడుకు రత్నమండీ. బుద్ధిగా చదువుకుంటున్నాడు. మీరసలు గమనించడం లేదుగానీ వాడికి చదువంటే ఎంత శ్రద్ధ అనుకున్నారు'' కొడుక్కి వత్తాసు పలికింది జయమ్మ.

"ఎవరో చెప్పడం కాదే జయా. సాక్షాత్తు మన కిట్టు క్లాస్ టీచరే చెప్పారు. మనవాడు సరిగా స్కూలుకు పోవడం లేదట'' అన్నాడు రాజారావు.

"ఎవరిని చూసీ ఎవరనుకున్నారో ఆ మాస్టారు'' అందామె.

రాజారావు, జయమ్మల ముద్దుల కొడుకు రామకృష్ణ. పెళ్లయిన చాలాకాలానికి పుట్టాడు. చందమామ చేతికందినంతగా సంబరపడ్డారు భార్యాభర్తలు. "కాశీలో విశ్వేశ్వరునిలా, శ్రీశైలంలో మల్లికార్జునిలా, ధర్మస్థలిలో మంజునాథునిలా నా యింటికి, కంటికి వెలుగు నింపేవాడు మన కిట్టునే జయా'' అనేవాడు రాజారావు.

ఇప్పుడిప్పుడే పైకొస్తున్న ధనవంతుడు రాజారావు. ఎప్పుడు ఏదో ఒక వ్యవహారంతో తలమున్కలుగా వుండేవాడు. కొడుకు చదువుపై తగిన శ్రద్ధ చూపలేకపోయాడు.

ప్రభుత్వం వారి పుణ్యాన చదువు వచ్చినా రాకపోయినా ఐదో తరగతి పూర్తి చేశాడు రామకృష్ణ. హైస్కూల్లో చేరేనాటికి రామకృష్ణ స్నేహితుల సంఖ్య పెరిగింది. దొంగ అటెండెన్సు పలికేవాళ్లు, నోట్సు వ్రాసి ఇచ్చేవారు, పరీక్షల్లో కాపీ కొట్టడానికి సహకరించేవాళ్లు, ఇలా అన్ని విషయాల్లోను మిత్రబృందం సాయం చేసేది.

"పదోతరగతిలో పబ్లిక్ పరీక్షలంట కదా. ఈయేడు బాగా చదివి పాస్ కాకపోయావో మీనాన్న నీకంటే ముందు నాకు దేహశుద్ధి చేస్తాడు'' భయాన్ని వెలిబుచ్చింది జయమ్మ.

"అమ్మా! ఒకటో క్లాసు నుండి ఏనాడైనా ఫెయిలయ్యానా! చూస్తూండు పదోతరగతి ఫస్టున పాసవుతా'' అన్నాడు కాలరెగరేస్తు రామకృష్ణ. "నాకు తెలుసురా కన్నా. నీవు కాకపోతే ఇంకెవరు పాసవుతార్రా? ఇంద తీసుకో'' అంటూ ఐదువందల రూపాయలు కొడుకు చేతికందించింది జయమ్మ.

అనుకున్న పరీక్షలు రానేవచ్చాయి. జంబ్లింగ్ సిస్టం పుణ్యాన పరీక్షల్లో రామకృష్ణ మిత్రులంతా విడిపోయారు. రామకృష్ణకు తోడు లేకుండా అయింది. పరీక్షలంటే భయం పట్టుకుంది. ఏనాడు పుస్తకం పట్టనివాడు ఇప్పుడు పుస్తకం తీస్తున్నాడు. రోజుకు నాలుగుసార్లు దేవుడికి దండం పెట్టుకుంటున్నాడు. అయినా చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే లాభమేముంది?

పద్మవ్యూహంలో పోరాడిన అభిమన్యుడిలా ముందు వెనకాల, అటు ఇటు దొరికిన కాపీ దొరికినట్లు పేపర్‌లో ఎక్కించాడు. ఎలాగయితేనేం పరీక్షలు పూర్తయ్యాయి.

రిజల్టు వచ్చాయని పిల్లలంతా హడావిడి చేస్తుంటే హాయిగా టి.వి చూస్తూ కూర్చున్నాడు రామకృష్ణ. "ఆంటీ! మీ రామకృష్ణ ఫెయిలయ్యాడు'' పక్కింటి జలజ చెప్తుంటే తల వంచుకున్నాడు రామకృష్ణ.

"అన్నీ బాగానే వ్రాశానమ్మా. ఇంగ్లీష్ మాత్రమే కొద్దిగా డౌటు. మార్కులు రానీ నీకే తెలుస్తుందిగా'' అన్నాడు రామకృష్ణ. మార్కుల మెమో చూస్తున్న రామకృష్ణ కళ్లలో నీళ్లు తిరిగాయి. ఒక్క తెలుగులో మాత్రం ముప్పయి మార్కులొచ్చాయి. ఇక ఏ సబ్జెక్టులోను కనీసం రెండంకెలు రాలేదు. "ఏమండీ రాజారావుగారూ! మీ అబ్బాయి పాసయ్యాడా'' అని అడిగే మిత్రులకు ఏం చెప్పాలో తోచక సతమతమయ్యేవాడు రాజారావు.

రెండు మూడుసార్లు ప్రైవేట్‌గానే పరీక్షలు వ్రాశాడు రామకృష్ణ. కాని ఒక్క సబ్జెక్టు కూడా పాస్ కాలేకపోయాడు. చదువు పక్కన పెట్టి వ్యాపార మెళుకువలు కొడుక్కి చెప్పేవాడు. రామకృష్ణ చేత చిన్న ఫ్యాన్సీ షాపు ప్రారంభింపజేశాడు. ఆ తర్వాత ఓ మంచి సంబంధం చూసి రామకృష్ణ పెళ్లి చేశాడు రాజారావు.

కొన్నాళ్లు అత్తవారింట్లో వుండి భార్యను వెంటబెట్టుకొని వూరికి ప్రయాణమయ్యాడు రామకృష్ణ. ఊళ్లో రైల్వేస్టేషన్ వుంది. కాని ఐదుకిలోమీటర్లు నడవాల్సిందే. ఫలానా రైలుకు వస్తామని, స్టేషన్‌కు బండి కట్టుకొని రావాలని ముందుగానే ఇంటికి జాబు వ్రాశాడు. లగేజితోపాటు భార్యను వెంటబెట్టుకొని రైలు దిగాడు రామకృష్ణ. జాబు వ్రాసినా తనకోసం ఎవరూ బండికట్టుకు రాలేదు. కొత్త పెళ్లాం ముందు ఎంత అవమానం. "మా నాన్నకు తెలివి లేకపోతే, అమ్మయినా చెప్పి వుండొచ్చుకదా'' అంటూ భార్య ముందు తన కోపాన్నంతా చూపాడు.

ఎలాగో తంటాలు పడి ఇల్లు చేరేటప్పటికి సాయంకాలమైంది. "మీ విలువ ఇంతేనా'' అన్నట్లుగా ఓ చూపు విసిరి ఇంట్లోకి వెళ్లింది భార్య. కడుపులో కాలిపోతోంది. దానికి తోడు భార్య తిరస్కార చూపులు. అగ్గిమీద గుగ్గిలమయ్యాడు రామకృష్ణ.

"ఏరా కిట్టూ. ఇలా చెప్పాపెట్టకుండా కోడలితో రావడమెందుకు, ఇలా తిప్పలు పడడమెందుకు. బండి కట్టుకురావాలని ఉత్తరంలో రాయొచ్చుకదా'' అన్నాడు సాగదీస్తూ రాజారావు.

"చేసింది చాలక పైగా వెక్కిరింపు మాటలు కూడానా. బండి కట్టుకురమ్మని రాశాను కదా'' సీరియస్‌గా అన్నాడు రామకృష్ణ.

"ఆ ముక్క నీవు రాసిన వుత్తరంలో ఎక్కడుందో కాస్త చూపించు నాయనా'' అంటూ జాబు చేతికందించాడు రాజారావు. ఉత్తరం చివర్లో "టెస్కిబడ్డిపప్పల్ల'' అనే వాక్యాన్ని చూపించాడు రామకృష్ణ.

"స్టేషన్‌కి బండి పంపాల... ఆ వాక్యానికి అర్థం ఇదా! ఇది ఏ భాష నాయనా!'' కొడుకు వ్రాసిన తెలుగును తలచుకొని ముక్కున వేలేసుకున్నాడు రాజారావు.

"ఇప్పటికైనా చదువు నేర్చుకో.. నలుగురిలో నీ గౌరవాన్ని పెంచుకో'' అంటూ ఆప్యాయంగా కొడుకు భుజం తట్టాడు రాజారావు. తండ్రి చూపిన వాత్సల్యానికి మనసులో కృతజ్ఞతలర్పించాడు రామకృష్ణ.

★